

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 205 పేజీలు - 08 వెల - 05/- బుధవారం 22-07-2026


మధుమణి ఆసుపత్రి సేవలు ప్రశంసనీయం: మంత్రి ఫరూక్.





# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్..

### దావోస్‌లో కుదిరిన ఒప్పందానికి కార్యరూపం

- ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ భేటీ
- మామిడి, అరటి వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం
- ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య కుదిరిన కీలక భాగస్వామ్యం



ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో కుదిరిన మరో కీలక ఒప్పందం కార్యరూపం దాల్చే దిశగా ముందడుగు పడింది. రాష్ట్రంలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళవారం

మిగతా 2లో

# విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన వామపక్ష ఎంపీలు

- పోరాట స్ఫూర్తితో ఆందోళన ప్రదేశం తిరిగి స్వాధీనం
- కేంద్ర మంత్రి రాజీనామాపై సీజేపీ స్పష్టం



న్యూఢిల్లీ కేంద్రమంత్రి రాజీనామా చేసేవరకు పోరాటానికి వెనుకడుగు వేసేదేలేదని సీజేపీ స్పష్టం చేసింది. మోడీ ప్రభుత్వ అణచివేత చర్యలను పోరాట స్ఫూర్తితో అధిగమించి, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన ప్రదేశాన్ని నేతలు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ మార్చ్ అనంతరం పోలీసులు, కేంద్ర బలగాలు కూల్చివేసి, సీల్ చేసిన ఎస్ఎఫ్ఐ క్రాంతి కార్నర్‌తో సహా నిరసన టెంట్లను మంగళవారం గంటల వ్యవధిలోనే పునరుద్ధరించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ చేపట్టిన ఆందోళన నుంచి వెనుకడుగు వేయబోమని సీజేపీ నేతలు ప్రకటించారు. 20న చేపట్టిన పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులను పోలీసులు, కేంద్ర బలగాలు దారుణంగా కొట్టాయి. గాయపడిన వారికి ఢిల్లీలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. తలకు గాయమైన 20 ఏండ్ల విద్యార్థి ఆర్ఎంఎల్ ఆస్పత్రి ఐసీయూలో ఉన్నారు. గాయపడిన వారిని పరామర్శించడానికి సీజేపీ, విద్యార్థి సంఘ నేతలను పోలీసులు

మిగతాది 2లో

# 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది.

### వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందన్న నిమ్మల

- నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శ
- ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు బాగుపడుతున్నాయని వ్యాఖ్య



2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని... కానీ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలన వల్ల ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయంలో జలవనరుల శాఖపై ఈరోజు ఆయన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు, వాటి తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు. 2014-19 మధ్యకాలంలో పోలవరం పనులు వేగంగా జరిగి 72 శాతం మేర పూర్తయ్యాయని, అయితే జగన్ 'ఒక్క ఛాన్స్' అంటూ వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో తీవ్ర నష్టం చేశారని విమర్శించారు.

మిగతాది 2లో

# రాజకీయ నాటకాలు వద్దు.

### ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం




- పార్లమెంటులో చర్చించకుండా రాజకీయం చేస్తున్నారని మండిపాటు
- వరుస ఎన్నికల్లో ఓడినా కాంగ్రెస్ తీరు మారడం లేదని వ్యాఖ్య
- బాధ్యతాయుత ప్రతిపక్షం కావాలి కానీ, నిరంతరం ఆందోళన చేసేది కాదంటూ హితవు

కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటు సమావేశాల వేళ సభలో చర్చల్లో పాల్గొనకుండా, ప్రధానమంత్రి నివాసం వెలుపల నిరసనల పేరుతో రాజకీయ నాటకాలకు తెరలేపడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల

# ఓటర్ల జాబితా సవరణ:

### ఆధార్‌పై తెలంగాణ సీఈవో కీలక ప్రకటన

- ఎన్యూమరేషన్ ఫామ్‌ల కోసం ఆధార్ తప్పనిసరి కాదని స్పష్టీకరణ
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి
- ఇతర గుర్తింపు పత్రాలతో నమోదు చేసుకునేందుకు అవకాశం




తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపడానికి ఆధార్ కార్డు తప్పనిసరి కాదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

మిగతాది 2లో

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..




# గల్లా మాధవి ఏ దావా వేసినా ఎదుర్కొంటా!

- గుంటూరులో మహిళపై దాడి చేసిన ఘటనపై తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్న అంబటి
- ఈ ఘటనను గల్లా మాధవి సెటిల్‌మెంట్ చేయడానికి యత్నించారని ఆరోపణ
- ఘటన జరిగిన వెంటనే పోలీసులు కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్న



గుంటూరులో మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటనపై ఎమ్మెల్యే గల్లా మాధవిపై తాను చేసిన ఆరోపణలకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నానని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యే మాధవి స్వయంగా ఈ వ్యవహారాన్ని సెటిల్‌మెంట్ చేయడానికి ప్రయత్నించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై పరువునష్టం దావా వేస్తానని చెబుతున్న సోదరి మాధవికి,

మిగతాది 2లో

# రాహుల్, ప్రియాంక విడుదల

- నీట్ వివాదంపై ఢిల్లీలో కాంగ్రెస్ భారీ నిరసన
- ప్రధాని నివాసం వద్ద ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీ అరెస్ట్
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- రాహుల్, ప్రియాంకలను కాసేపటికే విడుదల చేసిన ఢిల్లీ పోలీసులు



నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలతో దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఆందోళన చేస్తూ పోలీసుల నిర్బంధంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలను కలిసేందుకు ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్

మిగతాది 2లో

# ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..




- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత

# రాజకీయ నాటకాలు వద్దు

బాధ్యత పార్లమెంటులో ప్రశ్నలు అడగటం, చర్చలు జరపడమే తప్ప, సభా కార్యకలాపాలకు విఘాతం కలిగించడం కాదని ఆయన హితవు పలికారు.
సభలో చర్చకు ఆస్కారం లేకుండా పదేపదే అంతరాయం కలిగిస్తూ, వాయిదాలకు కారణమవుతున్న కాంగ్రెస్, బయటకు వచ్చి ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ నాటకాలాడుతోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇది బాధ్యతాయుతమైన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదని, ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచే కుట్ర అని ఆయన ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన కాంగ్రెస్ పార్టీ, నేడు ప్రజాస్వామ్యం విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు.
మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం, పుదుచ్చేరి వంటి అనేక రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను తిరస్కరించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఆ పార్టీ ప్రజాసేవ కంటే రాజకీయ అవకాశవాదానికే పెద్దపీట వేస్తుందని, ప్రజలు ఇప్పటికే వారి నిజస్వరూపాన్ని గుర్తించారని ఆయన పేర్కొన్నారు. నిరసనలో భాగంగా కాంగ్రెస్ నేతలు ప్రతీకాత్మకంగా చేతులకు సంకెళ్లు వేసుకోవడంపై ఆయన ఎద్దేవా చేస్తూ, ఆ పార్టీ రాజకీయ ఆకాంక్షలకు భారత ప్రజలు ఎప్పుడో సంకెళ్లు వేశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు నిజంగా వాదనలు వినిపించాలనే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దేశానికి బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అవసరమే కానీ, నిరంతరం గందరగోళం సృష్టించే ప్రతిపక్షం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..
# హైదరాబాద్‌కు చెందిన కుటుంబంలో ముగ్గురి మృతి

- అమెరికాలోని కాలిఫోర్నియాలో రోడ్డు ప్రమాదం
- నవీద్ భార్య, కుమార్తె, కుమారుడు మృతి
- తీవ్రంగా గాయపడిన నవీద్, చిన్నకూతురు

అమెరికాలో జరిగిన ఒక ఘోర ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద వార్త తెలియడంతో వారి బంధువర్గం, తెలుగు ఎన్నారై సమాజం తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి.ప్రాథమిక సమాచారం ప్రకారం, అమెరికాలోని కాలిఫోర్నియాలో చోటుచేసుకున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక అధికారులు, భారత రాయబార కార్యాలయం అధికారులు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు.
హైదరాబాద్‌లోని యాకుత్‌పురా ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వాణి నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ నవీద్ గతంలో నగరంలోని ఒక ప్రముఖ ఫార్మా ల్యాబ్‌లో పని చేశారు. ఇటీవల అమెరికాలోని మెర్క్ ఫార్మా కంపెనీలో ఉద్యోగం రావడంతో ఆయన తన కుటుంబంతో సహా అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాదంలో నవీద్ భార్య నజియా (45), కుమార్తె హాఫీజా షేక్ (19), కుమారుడు హాఫీజ్ ఒమర్ (14) మృతి చెందారు. నవీద్‌తో పాటు ఆయన చిన్న కూమార్తె తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో బంధువులు, కుటుంబ సభ్యులు నవీద్ నివాసానికి చేరుకున్నారు.

# విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన వామపక్ష ఎంపీలు

వేయబోమని సీజేపీ నేతలు ప్రకటించారు.20న చేపట్టిన పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులను పోలీసులు, కేంద్ర బలగాలు దారుణంగా కొట్టాయి. గాయపడిన వారికి ఢిల్లీలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. తలకు గాయమైన 20 ఏండ్ల విద్యార్థి ఆర్ఎంఎల్ ఆస్పత్రి ఐసీయూలో ఉన్నారు. గాయపడిన వారిని పరామర్శించడానికి సీజేపీ, విద్యార్థి సంఘ నేతలను పోలీసులు అనుమతించడం లేదు. చికిత్స పొందుతున్న వారిపై, పరామర్శించడానికి వచ్చేవారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు. కొందరు గాయాలను సైతం లెక్కచేయకుండా జంతర్ మంతర్ వద్దే ఉండిపోయారు. సుమారు 70 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. రాజధానిలో దాదాపు 3,000 మందికి పైగా సాయుధ భద్రతా సిబ్బందిని కేంద్రం మోహరించింది. పోలీసుల అదుపులో ఉన్న సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను 25వ రోజుకు కొనసాగించారు. ఆయన డిమాండ్లను అంగీకరించే వరకు వెనక్కి తగ్గబోనని ప్రకటించారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ, విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళన 32 రోజు మంగళవారం కొనసాగింది.మంగళవారం జంతర్ మంతర్ వద్ద పెరుగుతున్న నిరసనకారులలో పాటు ఆత్మహత్య చేసుకున్న మహారాష్ట్రకు చెందిన ఒక నీట్ అభ్యర్థి బంధువులు కూడా ఉన్నారు. వారు ఈ ఏడాది మొదటి పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డు కాపీని పట్టుకుని కనిపించారు. సోమవారం నిరసనకారులపై లాఠీ చార్జ్ చేయడమే కాకుండా 10 ఏండ్ల బాలుడిని సైతం కొట్టడంతో పలువురు ఆందోళన కారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పిల్లలు అని కూడా చూడకుండా దౌర్జన్యం చేయడమేంటంటూ పోలీసుల తీరును పలువురు తీవ్రంగా తప్పుడుతున్నారు. పోలీసులు కొడుతుంటే సదరు బాలుడు భయంతో పరుగులు తీస్తున్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వామపక్ష ఎంపీల మద్దతు

అణచివేత, పోలీసుల క్రూరత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఒంటరిగా లేరని ప్రకటిస్తూ, వామపక్ష ఎంపీలు, నాయకులు జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదేశానికి చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ నాయకుల రాక ఒక బలమైన హెచ్చరిక అయింది. రక్తసిక్తమైన ఈ నిరసనలో ప్రతిపక్ష నాయకులు వారి బలాన్ని పూర్తిస్థాయిలో కూడగట్టడంతో ఢిల్లీలో నిరసన తీవ్రరూపం దాల్చింది. సీపీఐ(ఎం) ఎంపిలు అమ్రారామ్, కె. రాధాకృష్ణన్, జాన్ బ్రిట్టాస్, వి. శివదాసన్, ఎఎ రహీమ్, ఎస్ వెంకటేశన్, ఆర్. సచ్చిదానందం, సీపీఐ ఎంపీలు పి. సంతోష్ కుమార్, పీపీ సునీర్, కె సుబ్బరాయన్, కేరళ కాంగ్రెస్ (ఎం) ఎంపీ జోస్ కె మణి జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను, గాయపడిన విద్యార్థులను ఎంపీలు కలుసుకున్నారు. పోలీసుల చర్యపై పార్లమెంటులో అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, విద్యార్థులు, యువతపై జరిగిన భయానక దాడులు, అరాచకాలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షానే బాధ్యులని స్పష్టం చేశారు. ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని, అసహనాన్ని కేంద్ర ప్రభుత్వ అణచివేత చర్యలు అడ్డుకోలేవని స్పష్టం చేశారు. నిరసనకారులను కలవకుండా పోలీసులు సీపీఐ(ఎం) నాయకులను అడ్డుకున్నారు. వారిని ఆపే క్రమంలో కె. రాధాకృష్ణన్ చేతికి స్వల్ప గాయమైంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, అతిషి, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, శివసేన ఎంపీలు సంజయ్ రౌత్, అరవింద్ సావంత్ కూడా జంతర్ మంతర్‌కు చేరుకుని సంఘీభావం తెలిపారు.

మేదాంతకు వాంగ్‌చుక్ తరలింపు

ఢిల్లీ హైకోర్టు ఆదేశం తర్వాత పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను మంగళవారం సాయంత్రం సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి నుంచి గురుగ్రామ్‌లోని మేదాంతకు తరలించారు.
ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తాం
నిర్బంధంలో ఉన్నవారిని న్యాయవాదులు కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే, ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వెలుపల రాత్రి 8 గంటలకు శాంతియుత ధర్నా చేపడతామని సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రాంకా, దీపక్ బలియాన్, సౌరవ్ దాస్ ప్రకటించారు. ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే అదుపులోకి తీసుకున్న వారిందరిని పోలీసులు విడుదల చేశారు.

ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు

ఢిల్లీ పోలీసులు ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పోలీసులు, భద్రతా దళాలపై?దాడులు, పోలీసు, ప్రభుత్వ వాహనాల ధ్వంసం, ప్రజా ఆస్తుల ధ్వంసం వంటి నేరాలపై ఈ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ ఘటనల్లో మొత్తం 118 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారని పేర్కొన్నారు. ఇందులో కొందరు సీనియర్ అధికారులు కూడా ఉన్నారు. ఇప్పటివరకు 70 మందికిపైగా ఆందోళనకారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌తోపాటు ఇతర పోలీస్ స్టేషన్లలో ఈ ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అనుమతి లేకుండా డ్రోన్లు ఎగరేయడం, హింసకు కుట్ర పన్నడం, ?సిబ్బందిపై దాడి చేయడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి వాటిపై కూడా కేసు నమోదు చేశారు.

విద్యార్థులను పరామర్శించిన నేతలు

పార్లమెంట్ మార్చ్‌లో పోలీసులు, ?కేంద్ర బలగాల క్రూరత్వ చర్యలతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థులు, యువతను వివిధ పార్టీల నేతలు పరామర్శించారు. ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని రాహుల్ గాంధీ, ఎంపీలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ పరామర్శించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, అతిషి, ఎంపీ సంజయ్ సింగ్ తదితరులు పరామర్శించారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా పరామర్శించారు.

# ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..
## రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ



ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు.
పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి.
చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

# ఓటర్ల జాబితా సవరణ
## :ఆధార్‌పై తెలంగాణ సీఈవో కీలక ప్రకటన

. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయితే, దరఖాస్తు ఫారాలు నింపే సమయంలో ఆధార్ వివరాలు సమర్పించడం తప్పనిసరి అని కొందరు భావిస్తుండటంతో సీఈవో ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఆధార్ కార్డు లేని కారణంగా ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు అందుబాటులో లేని అర్హులైన పౌరులు, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్తగా నమోదు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా, సుదర్శన్ రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎన్నికల అధికారులతో (డీఈఓలు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వారాంతం నాటికి జిల్లాల్లో ఓటర్ల గణన ప్రక్రియ కనీసం 90 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించిన ఓటర్లను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తిరిగి భౌతిక పత్రాలు కోరకూడదని, అలాగే ఆధార్ కార్డుల కోసం ఒత్తిడి చేయవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తుల సమర్పణలో ఓటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్.

ముందడుగు పడింది. రాష్ట్రంలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది.ఈ ఏడాది దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిపిన చర్చల సందర్భంగా ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావడంలో భాగంగా యూఏఈ ప్రతినిధులు అమరావతికి వచ్చారు. ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక పూర్తిస్థాయి వ్యాల్యూచైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. దీనికోసం ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య అధికారికంగా భాగస్వామ్యం కుదిరింది.ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలో అధికంగా పండే మామిడి, అరటి, కోకో వంటి ఉద్యాన ఉత్పత్తులను శుద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలతో ప్యాక్ చేసి, అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకు మేలు చేయడంతో పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కీలక సమావేశంలో యూఏఈ ప్రతినిధులతో పాటు రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులు, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులు పాల్గొన్నారు.

# 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

అయితే జగన్ 'ఒక్క ఛాన్స్' అంటూ వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేయవద్దని ఎంతమంది హెచ్చరించినా వినకుండా, 17 నెలల పాటు పనులను నిలిపివేశారని మండిపడ్డారు. దీని ఫలితంగానే 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్‌వాల్ పూర్తిగా దెబ్బతిన్నదని నిపుణులు స్పష్టం చేశారని తెలిపారు. ఆఖరికి పోలవరం నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. ధ్వంసమైన జలవనరుల రంగాన్ని పునర్నిర్మించి పూర్వ స్థితికి తీసుకువస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 36 ప్రధాన ప్రాజెక్టులను ఏ స్థాయిలో పూర్తి చేస్తామనే దానిపై స్పష్టమైన కార్యాచరణను వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు తాగు, సాగు నీటిని సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

# గల్లా మాధవి ఏ దావా వేసినా ఎదుర్కొంటా:

ఎమ్మెల్యే మాధవి స్వయంగా ఈ వ్యవహారాన్ని సెటిల్‌మెంట్ చేయడానికి ప్రయత్నించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై పరువునష్టం దావా వేస్తానని చెబుతున్న సోదరి మాధవికి, నిరభ్యంతరంగా దావా వేసుకోవచ్చని తాను సవాల్ విసురుతున్నానని, ఎలాంటి న్యాయపరమైన దావానైనా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తేల్చిచెప్పారు. మహిళపై దాడి జరిగిన వెంటనే పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని నిలదీశారు. ఎమ్మెల్యే మాధవి నేరుగా ఫోన్ చేసి చెప్పడం వల్లే పోలీసులు చర్యలు తీసుకోకుండా ఉపేక్షించారని ఆరోపించారు. గుంటూరు నడిరోడ్డుపై ఒక మహిళను వివస్త్రను చేయడానికి ప్రధాన కారణం ఎమ్మెల్యే మాధవినేనని, ఒక టీడీపీ నేత ఒక మహిళ బట్టలిప్పదీసి కూర్చోబెట్టడం అత్యంత దారుణమైన విషయమని మండిపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ఒక మహిళకు రాగా, ఆమె వాటిని అందరికీ పంపించిందని, కానీ ఇప్పుడు ఆ మహిళనే టార్గెట్ చేస్తూ ఆమె సెల్ ఫోన్‌ను లాక్కున్నారని అంబటి తెలిపారు. ఆ వీడియోలు బయటకు రాకపోతే అసలు పోలీసులు కేసే నమోదు చేసేవారు కాదని దుయ్యబట్టారు. చట్టప్రకారం నడుచుకోకుండా ఎమ్మెల్యే చెప్పినట్లు వింటే భవిష్యత్తులో పోలీసులపైనే నిందలు పడతాయని హెచ్చరించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని... హోంశాఖ, పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించిన ఆయన, వచ్చే ఎన్నికల్లో ప్రజలే, ముఖ్యంగా మహిళలు ఈ ప్రభుత్వానికి పెద్ద దావా వేస్తారని వ్యాఖ్యానించారు.

# రాహుల్, ప్రియాంక విడుదల

ట చైర్‌పర్సన్ సోనియా గాంధీ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. అయితే, భద్రతా కారణాల రీత్యా ఆమెను



లోపలికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనతో పోలీస్ స్టేషన్ వెలుపల కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రధాని నివాసం వద్ద ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రియాంక, తదితర నేతలను మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్ ను ఛత్రసాల్ స్టేడియం పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాసేపటి తర్వాత రాహుల్ గాంధీని ఛత్రసాల్ పీఎస్ ను విడుదల చేశారు. అటు, ప్రియాంక, దీపేందర్ హుడా తదితర నేతలను మందిర్ మార్గ్ పీఎస్ నుంచి విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత, నీట్ పరీక్షలో అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నేతలు ధర్నాకు దిగారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మల్లికార్జున ఖర్గే సహా పలువురు కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జిని నిరసిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

# కురువలు ఐక్యతతో రాజకీయంగా ముందుకు

-సాగాలి..(రాష్ట్ర కురువ సంఘం సహాయ కార్యదర్శి కురువ పాపారాయుడు)..




గడివేముల పల్లె వెలుగు దినపత్రిక, కురువలు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర కురువ సంఘం సహాయ కార్యదర్శి కురువ పాపారాయుడు అన్నారు. మంగళవారం నాడు పాణ్యం నియోజకవర్గం మండల కేంద్రమైన గడివేము లలో ఆయన మాట్లాడుతూ కురువ సమాజం రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలని ప్రతి ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని సహాయ కార్యదర్శి పాపారాయుడు తెలిపారు. అదేవిధంగా వ్యక్తిగత విభేదాలకు స్వస్తి చెప్పి కురువ కులస్తులకు సామాజిక పరంగా రాజకీయపరకంగా ఆర్థికపరంగా ఎంతో కొంత కురువలకు ఉపయోగ పడేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. కురువలు ఆర్థిక సామాజిక రాజకీయ రంగాల్లో పూర్తిగా వెనకబడ్డారని ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని ఆయన తెలిపారు. తదనంతరం కురువ పాపారాయుడు అనే తనను నూతనంగా రాష్ట్ర కురువ సంఘం సహాయ కార్యదర్శిగా ఎన్నుకోబడినందుకు కురువ కులస్తులందరికీ శుభాభి వందనాలు తెలుపుతూ కురువ కులస్తులకు తనవంతు, చాయచక్తుల పనిచేస్తానని తెలిపారు.

# అంగన్వాడీలకు కనీస వేతనం నెలకి 26 వేల పెంచాలి.

- ఈ నెల 31వ తేదీ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం.
- డిమాండ్స్ తో వినతి పత్రం ఐసిడిఎస్ పిడి సిఐటియు వినతి.





డిమాండ్స్ :
1. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు రూ. 26,000/- లు ఇవ్వాలి.
2. పెన్షన్, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు అమలు చేయాలి.
3. పెండింగ్‌లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలి.
4. హెల్పర్ల ప్రమోషన్‌కి 5 సం॥రాల సీనియారిటీని రద్దు చేయాలి.
5. సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
6. పనిభారం పెంచే నవచేతన యాప్‌ను రద్దు చేయాలి.
7. పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలి.

ఏ.పి. అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నందు జిల్లా అధికారి పిడి సిడిపిఓ, సిఐటియు అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేతనాలు పెంచాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటమ్మ, నాయకురాలు వరలక్ష్మి, సరోజ ,పద్మ సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలకు కనీస వేతనం పెంచకుండా చాలీచాలని జీతం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు కావస్తున్న కూటమి ప్రభుత్వం అంగనవాడి లకు వేతనాలు పెంచకుండా కాలయాపన చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ప్రమాద బీమాసౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తదితరుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 31వ తేదీ కర్నూలు కలెక్టరేట్ ముందు జరుగు స్కీమ్ వర్కర్లు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గీత రేణుక రిజ్వాన లలిత సోమక్క మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి జీతాలు పెంచాలి.

- ప్రభుత్వ శాఖల లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు డిమాండ్స్ నెరవేర్చాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జీతాలు పెంచాలి, రెగ్యులర్ చేయాలి.
- రాష్ట్ర ప్రభుత్వాన్ని కి సిఐటియు డిమాండ్.




ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఈ నెల 30 వ తేదీ కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది, సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న పియర్స్ గోపాల్, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు బీచుపల్లి,మల్లికార్జున, రాజేష్, నల్లన్న, వీరేష్, నాగవేణి, బాబి, మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రభుత్వ విద్యా శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అప్పటివరకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు, కావున ఈ నెల 30వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులన కు పిలుపునిచ్చారు.

# మధుమణి ఆసుపత్రి సేవలు ప్రశంసనీయం: మంత్రి ఫరూక్.

**ఉచిత శస్త్ర చికిత్సల కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి ఫరూక్.**
**ముఖ్యమంత్రి పి 4 కార్యక్రమంలో భాగంగా 50 లక్షల విలువ చేసే 100 ఉచిత శస్త్ర చికిత్సలు.**








పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని మధుమణి ఆసుపత్రి ఆధ్వర్యంలో నంద్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో మధుమణి చారిటబుల్ సొసైటీ తరపున సోమవారం మొదలైన 36వ ఉచిత శస్త్ర చికిత్సల శిబిరంలో మొదటిరోజు చేసిన వైద్య పరీక్షలలో ఎంపికైన వారికి మంగళవారం నుండి శస్త్ర చికిత్సలు చేయడం ప్రారంభించారు.

ఈ ఉచిత శస్త్ర చికిత్సల కార్యక్రమాన్ని మధుమణి ఆపరేషన్ థియేటర్ వద్ద రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.

మధుమణి ఆసుపత్రి నిర్వాహకులు చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మణిదీప్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ముఖ్యమంత్రి పి 4 కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం 100 కుటుంబాలలోని వారికి 50 లక్షలు విలువ చేసే 100 శస్త్ర చికిత్సలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్యులు సేవా దృక్పథంతో పేదలకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. నంద్యాల నియోజకవర్గంలో పలు మండల కేంద్రాలలో ఆసుపత్రులను ఆధునీకరణ చేసి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మణిదీప్ మాట్లాడుతూ తమతోపాటు దేశంలో పేరెన్నిక గన్న ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు ఈ శిబిరంలో పాల్గొని అత్యున్నతస్థాయి ప్రమాణాలతో,అత్యంత ఖరీదైన పరికరాల వినియోగంతో శస్త్ర చికిత్సలు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ప్రతిరోజు 200 మందికి ఉచితంగా ఓపిడిలో పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జాతీయ ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు, లయన్స్ క్లబ్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ డాక్టర్ మధుసూదనరావు సేవలు నంద్యాల ఐఎంఏ కు గర్వకారణం అన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు రంగంలో ఈ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వారు ఎవరూ లేరని ప్రశంసించారు. డాక్టర్ మధుసూదనరావు సేవలు వైద్యులకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ సందర్భంగా మధుమణి ఆసుపత్రి, నంద్యాల ఐఎంఏ తరపున మంత్రి ఫరూక్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిత్, నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యుల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, మధుమణి కుటుంబ సభ్యులు సింధు, చిత్తలూరు శేష ఫణి, ప్రభుత్వ పి 4 కార్యక్రమం కోఆర్డినేటర్ చెన్నయ్య,చికిత్సల కోసం వచ్చిన రోగులు వారి బంధువులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటోల అడ్డాగా కీసర బస్‌స్టాప్.. ప్రయాణికుల నిరీక్షణకు చోటేదీ?

కీసర:21 (పల్లె వెలుగు దినపత్రిక) మేడ్చల్-- మల్కాజిగిరి జిల్లా కీసర మండల కేంద్రంలోని కీసర బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం వేచి ఉండాల్సిన ప్రదేశం ఆటోరిక్షాల అడ్డాగా మారడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు బస్సు ఎక్కే సమయంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆటోలు బస్‌స్టాప్ మొత్తాన్ని ఆక్రమించడంతో ఆర్టీసీ బస్సులు సక్రమంగా ఆగలేకపోతున్నాయి. దీంతో ప్రయాణికులు రద్దీగా ఉన్న రోడ్డుపైకి వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ కారణంగా తరచూ వాహనాలు నిలిచిపోతుండగా, ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్‌స్టాప్ వద్ద ఆటోల పార్కింగ్‌పై నియంత్రణ విధించి, ప్రయాణికులకు ప్రత్యేకంగా నిరీక్షణ స్థలం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా కీసర బస్‌స్టాప్ వద్ద ఆటోల ఆక్రమణ, ట్రాఫిక్ సమస్యలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదని చెబుతున్నారు.







: ప్రజల డిమాండ్లు బస్‌స్టాప్ వద్ద అక్రమ ఆటో పార్కింగ్‌ను వెంటనే తొలగించాలి. బస్సులు ఆగేందుకు ప్రత్యేక బే ఏర్పాటు చేయాలి.

# బొడ్రాయి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న చీర్యాల గ్రామం

**జూలై 24 నుంచి 26 వరకు వైభవంగా ఉత్సవాలు.. ప్రత్యేక పూజలు, బోనాలు,**





చీర్యాల, (పల్లె వెలుగు దినపత్రిక).జూలై 21: మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని చీర్యాల గ్రామం బొడ్రాయి బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఈ నెల 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్థులు, యువత, ఆలయ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, బోనాల సమర్పణ, మహామంగళహారతులు, అన్నదాన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తూ పండుగ శోభను తీసుకొస్తున్నారు. మూడు రోజుల పాటు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో తాగునీరు, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఉత్సవాలు విజయవంతం కావాలని గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు సమిష్టిగా కృషి చేస్తున్నారు. ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా జరిగే చీర్యాల బొడ్రాయి బ్రహ్మోత్సవాలు గ్రామ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తాయని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈసారి కూడా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

# "డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవం" సభను జయప్రదం చేయండి.

**- డీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్.**

ఆదోని (పల్లె వెలుగు): మంగళవారం ఆదోని పట్టణంలోని ఎంఎల్ఏ పార్థసారథి ఆయన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర "దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) అధ్యక్షులు బి సి నాగరాజు, ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ లు కలిసి ఈ నెల 22వ తేదీ బుధవారం ఆదోని పట్టణంలో "డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవం" సభను "రెడ్డి జన సంఘం కమ్యూనిటీ హాల్ రెడ్డి హాస్టల్" నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రావాలని కోరగా ఎంఎల్ఏ సానుకూలంగా స్పందించి తప్పకుండా వస్తానని హృదయ పూర్వక హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల హజరు అవుతారని కావున ఆదోని డివిజన్ పరిధిలో ఉన్న దివ్యాంగులందరూ తప్పకుండా భారిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.



# రీ-సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీని మరింత వేగవంతం చేయాలి.

**రైతులకు వేగవంతమైన సేవలందించి ప్రజా విశ్వాసాన్ని మరింత పెంచాలి.**

**☛జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

రీ-సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, 22ఏ భూ సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా వేగవంతంగా సేవలందించాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ల్యాండ్ అండ్ సర్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సి సి ఎల్ ఏ) జి. జయలక్ష్మి రీ-సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, 22ఏ భూ సమస్యల పరిష్కారం, ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవల పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ల్యాండ్ అండ్ సర్వే ఏడి శ్రీరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

*వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రీ-సర్వే, 22ఏ భూ సమస్యల పరిష్కారం, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ తదితర లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రీ-సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, 22ఏ భూ సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానాలకు తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జూన్ నెలతో పోలిస్తే జూలై నెలలో ప్రజల అభిప్రాయంలో సుమారు రెండు శాతం మేర మెరుగుదల నమోదైందని పేర్కొన్నారు. ఈ సానుకూల ధోరణిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించే దిశగా* కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రీ-సర్వే ప్రక్రియలో రైతులకు అవసరమైన సర్టిఫికెట్లు తహశీల్దార్లు, విలేజ్ సర్వేయర్ల ద్వారా ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేవల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక




కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని చెప్పారు. కలెక్టరేట్ లేదా సంబంధిత ఏడి కార్యాలయాల పరిధిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా రైతులకు నేరుగా ఫోన్ చేసి వారి సమస్యలను తెలుసుకోవాలని, వాటిని సత్వరమే పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం, సానుకూల భావన మరింత పెంపొందేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రీ-సర్వే ప్రక్రియలో గణనీయమైన పురోగతి నమోదవుతోందని, ముఖ్యంగా ఆఫ్‌లైన్ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అలాగే పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీని ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేసి అర్హులైన రైతులందరికీ సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# కౌలు రైతులు పంట బీమా



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 21: బండి ఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల బండి ఆత్మకూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ... రైతులు సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట బీమా చేసుకోవాలని, సాగు దారులు కౌలు దారులు సైతం పంట బీమా చేసుకునే అవకాశం ఉందని వారు తెలిపారు.ఎల్ నినో కారణంగా వర్షాబావ పరిస్థితులను అనుసరించి ఆరుతడి పంటలు ఈనెల 30 వరకు విత్తనాలను విత్తుకోవచ్చని రైతులకు సూచించినట్లు తెలిపారు. ఇప్పటికే మొక్కజొన్న, సోయా చిక్కుడు సాగు చేసిన వారు కలుపు తీసుకొని, గంటులకు అవసరం మేరకు ఎరువులు వేసుకోవాలని సూచించారు. పొడి వాతావరణం కారణంగా రసం పీల్చే పురుగులు ఆశించడానికి అవకాశం ఎక్కువగా ఉందని, దీంతో రైతులు తమ పంటలకు పసుపు అట్టలు ఎకరానికి 10 పెట్టుకోవాలని, అలాగే ఇమిడాక్లిప్రిడ్ 0.3 మి లీ ఒక లీటర్ నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. తరువాత ఏపీఏ ఐఎంఎస్ యాప్ ద్వారా కౌలు రైతులు యూరియా, డిఏపి పొందవచ్చని రైతులకు సూచించినట్లు తెలిపారు.



పంట బీమా తప్పనిసరి

ఖరీఫ్ సాంగ్ చేసిన పంటకు కచ్చితంగా పంటవేమా చేసుకోవాలని, ఎకరాకు వరికి రూ.800, మొక్కజొన్నకు రూ.660, జొన్నకు రూ.190, మినుముకు రూ.190, కోర్ర ,సజ్జ ఆముదం రూ.160, ఉల్లికి రూ.450 పంట రుణాలు తీసుకున్న బ్యాంకులో కానీ లేదా మీ సేవ కేంద్రంలో గానీ ప్రీమియం చెల్లించి పంట బీమా చేసుకోవాలని రైతులను ఏఓ కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సునందన ఆయేషా పలువురు రైతులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 21 :బండి ఆత్మకూరు లోని ఏపీ మోడల్ స్కూల్






నందు ఎనిమిదో తరగతి విద్యార్థిని,విద్యార్థులకు భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాల సేకరణ విధానంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.నంద్యాల డిఆర్సి ఏడి సరళమ్మ,మండల వ్యవసాధికారి పవన్ కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఒక సమావేశంలో వారు మాట్లాడుతూరైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించేందుకు భూసార పరీక్షలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే మట్టి నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో ఎలా సేకరించాలో శిక్షణ అందించారు. అనంతరం విద్యార్థులను పాఠశాల ఆవరణలో మట్టి నమూనాల సేకరణ ప్రక్రియను ప్రత్యక్షంగా (డెమో) చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆబుదుర్ రాఫీ, సైన్స్ టీచర్ మీరాబాయి, వెటర్నరీ డాక్టర్ అనూష, డిఆర్సి ఏఓలు హేమ సుందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఏఈఓ అస్త్రఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో లో వాల్మీకి(బోయ)లుఎస్టీ బిల్లు ప్రవేశపెట్టాలి.

**బోయ (వాల్మీకి)హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు.**



ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ స్థానిక కార్యాలయం నందు బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు (బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు) దస్తగిరి నాయుడు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు మరియు వాల్మీకి నాయకులు మాట్లాడుతూ భారత దేశంలో వాల్మీకి బోయలు అన్ని రాష్ట్రాల్లో ఎస్సీలు గాను, ఎస్టీలు గాను రిజర్వేషన్లు ఉన్నాయి. కానీ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యందు 69 సంవత్సరాల క్రితం మన ఆంధ్రప్రదేశ్ కూడా ఎస్టిలోనే ఉన్నది. ఆ తర్వాత అప్పుడు ఉన్నటువంటి (ఉమ్మడి రాష్ట్రం) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి,13 జిల్లాలలో ఏజెన్సీ ప్రాంతాలు 5 జిల్లాలు (శ్రీకాకుళం, విజయనగరము, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి,)మాత్రమే ఎస్టీలు గాను పరిగణించి, మిగిలిన 8 జిల్లాలు (కర్నూలు చిత్తూరు,కడప, అనంతపురం,కృష్ణ ,ప్రకాశం,నెల్లూరు, గుంటూరు,) బీ.సీ.లుగా పరిగణించారు. కావున అప్పటినుంచి గత 69 సంవత్సరాల నుంచి కూడా వాల్మీకులు, పోరాటాలు చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వాలు కూడా, అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి పార్లమెంటుకు పంపిస్తే కూడా కేంద్ర ప్రభుత్వము వాపస్ పంపడం జరిగింది. కావున ఇప్పటికైనా ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో వాల్మీకుల బిల్లు ప్రవేశపెట్టి వాల్మీకుల ప్రాంతీయ వ్యత్యాసం తొలగించి, బీసీ లో నుంచి, ఎస్టి లుగా చేరుస్తారని డిమాండ్ చేస్తున్నాము. కావున ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వము వాల్మీకుల బిల్లు ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టి బిల్లు పాస్ చేయించాలని కోరుచున్నాము. ఈ సమావేశంలో, వాల్మీకి నాయకులు, ఆర్ రామకృష్ణ, బోయ చిన్న వీరప్ప, బోయ ఆర్. వి.బాబు, బోయ మదిరే (111)ఎల్లప్ప, బోయ కళ్యాణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీఛార్జ్ ఖండన

**☛కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**

**☛బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లరాముడు**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం సిగ్గుచేటని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లరాముడు విమర్శించారు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పేపర్ ప్రకటన చేశారు ఈ సందర్భంగా ఎల్ల రాముడు మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థ ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తక్షణమే ఆయన రాజీనామా చేయాలని, లేదంటే ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరసనలను అణచివేసే ధోరణి అవలంబించడం తగదన్నారు కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు సందీప్, రాకేష్, మహేష్ పాల్గొన్నారు

## మెగా డీఎస్సీ అంటే దేశంలో గుర్తుకొచ్చే పేరు చంద్రబాబు నాయుడు

**● టీచర్స్ ల మీద కక్ష సాధిస్తున్న వైసీపీ గొడ్డలి పార్టీ ● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప**

ఆదోని (పల్లె వెలుగు): 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట నిరుద్యోగులకు మెగా డీఎస్సీ జరిపిస్తామని చెప్పినారు అదే ప్రకారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సంతకమే మెగా డీఎస్సీ దయచేసి ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలోనే ఎక్కడ లేని విధంగా దాదాపు 16,000 పైగా ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రన్నకు దక్కుతుంది మన యువ నేత నారా లోకేష్ విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత విద్యకు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా విద్యార్థులను తీర్చి తిద్దుతున్నారంటే దానికి కారణం నూతనంగా సెలెక్ట్ అయిన ఉద్యోగస్తుల ప్రతిభ ఎంతో ఉందని మన లోకేష్ పేర్కొన్నారు ఈ అభివృద్ధిని ఈ మార్పును తట్టుకోలేక వైసీపీ గొడ్డలి పార్టీ ఒక ఎమ్మెల్సీ మెగా డీఎస్సీ కోస్షన్ పేపర్ లీక్ అయినవని హైకోర్టులో ఫీల్ చేయడం సిగ్గుచేటు దీన్ని న్యాయస్థానం తిప్పి కొట్టింది ఐదు సంవత్సరంలో వైసిపి ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా యువతను భ్రష్టు పట్టించింది నిరుద్యోగులకు శాపంగా మారినారు నాడు నేడు కింద పాఠశాలలకు పెయింట్ తప్ప ఒక్క ఉద్యోగమైన ఇచ్చినారా ఈరోజు ఉద్యోగం వచ్చిన ప్రతి కుటుంబం ఆనందంగా జీవిస్తున్నారు అది చూసి తట్టుకోలేక విష ప్రచారం చేస్తున్నారు, ఇప్పుడు స్థానిక ఎలక్షన్లు రావడంతో వైసిపి కి డిపాజిట్ కూడా రాదు అని తెలిసి ఏదో విధంగా ప్రజలను మభ్యే పెట్టే ప్రయత్నం చేస్తున్నారు రాష్ట్ర ప్రజలు నమ్మే ప్రసక్తే లేదు అని ఘాటుగా స్పందించారు.



# కస్తూరిబ పాఠశాలలో జాతీయ అందత్వ కార్యక్రమం



దొర్నిపాడు జులై 21 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని అమ్మిరెడ్డి నగర్ గ్రామంలో గల కస్తూరిబా బాలికల పాఠశాలలో మంగళవారం జాతీయ అందత్వ నివారణ దృష్టిలోప కార్యక్రమాన్ని జిల్లా అంధత్వనివారణ సంస్థ నంద్యాల వారి ఆదేశాల మేరకు పాఠశాల ఎస్ఓ జయమణి అధ్యక్షతన బాలికలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి నట్లు పాఠశాల ఎస్ ఓ తెలిపారుఈ సందర్భంగా ఎస్ ఓ జయమణి మాట్లాడుతూ పాఠశాల లో ఉన్న 261 మంది బాలికలకు కంటి పరీక్షలు నిర్వహించి అందులో 15 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి కండి అద్దాల కొరకు సిఫారసు చేసినట్లు ఆమె తెలిపారు, కండ్లకు గురించి విద్యార్థులకు వైద్యులు అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందము విద్యార్థులు పాల్గొన్నారు

# బాట సుంకలమ్మ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

- కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు, మొక్కుబడులు చెల్లింపు
- కర్నూలు కెఎస్ఆర్ కన్వెన్షన్‌లో పార్టీ శ్రేణులకు ఆత్మీయ విందు





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బాట సుంకలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన కాటసాని కుటుంబ సభ్యులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన కాటసాని రామభూపాల్ రెడ్డి, సాంప్రదాయ బద్ధంగా యాటలు కోసి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. నాటి నుంచి నేటి వరకు తమ కుటుంబానికి, ప్రజలకు బాట సుంకలమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఈ సందర్భంగా ప్రార్థించారు.అభిమానులు, కార్యకర్తల సమక్షంలో ఆత్మీయ విందు:

అమ్మవారి దర్శనం అనంతరం కర్నూలు నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న "ఖూ= కన్వెన్షన్ హాల్" (హ్యాంగ్ అవుట్) నందు పాణ్యం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం కాటసాని కుటుంబం భారీ ఆత్మీయ విందును ఏర్పాటు చేసింది. ఈ ఆత్మీయ విందు కార్యక్రమంలో కాటసాని రామభూపాల్ రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మలతో పాటు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి, ఆయన సతీమణి కాటసాని రూప శ్రీ మరియు కుటుంబ సభ్యులు పాల్గొని విచ్చేసిన అతిథులను మర్యాదపూర్వకంగా పలకరించారు.

ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, మున్సిపల్ కార్పొరేటర్లు, మహిళా నేతలు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోసపూరిత కాల్స్‌ను నమ్మవద్దు

**- కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : మున్సిపల్ కమిషనర్, ఎంహెచ్ఓ లేదా నగరపాలక సంస్థ అధికారులమని చెప్పి ట్రేడ్ లైసెన్స్ రుసుము, ఆస్తి పన్ను తదితర బకాయిలు చెల్లించాలని కోరుతూ వచ్చే మోసపూరిత ఫోన్ కాల్స్‌ను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఇటీవల ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించాలని కోరుతూ కొందరు అజ్ఞాత వ్యక్తులు ప్రజలకు ఫోన్ కాల్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు ఎవరూ వ్యక్తిగత ఫోన్ కాల్స్ చేసి ఆన్‌లైన్, యూపీఐ లేదా ఇతర డిజిటల్ చెల్లింపు విధానాల ద్వారా నగదు బదిలీ చేయాలని కోరరని స్పష్టం చేశారు.ట్రేడ్ లైసెన్స్ రుసుములు, ఆస్తి పన్ను లేదా ఇతర మున్సిపల్ బకాయిల చెల్లింపుల కోసం ప్రజలు నేరుగా నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తు తెలియని వ్యక్తుల ఖాతాలకు నగదు బదిలీ చేయవద్దని, అనుమానాస్పద కాల్స్ వచ్చిన వెంటనే నగరపాలక సంస్థకు సమాచారం అందించాలని కమిషనర్ కోరారు.

# రైతులు పంట బీమా చేసుకోవాలి..

**క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యం చేస్తున్న ఏవో**




చాగలమర్రి జూలై పల్లె వెలుగు 21 రైతులందరూ తప్పక పంట బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రంగ నేతాజీ తెలిపారు. మండలంలోని చిన్న వంగలి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఖరీఫ్ పంట కాలంలో ఎల్ నినో ప్రభావం వలన వర్ష భావ పరిస్థితులు ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుందని రైతులందరూ తప్పనిసరిగా పంట బీమా చేసుకోవాలని తెలిపారు. పంట బీమా పథకం రెండు విధాలుగా ఉంటుందన్నారు. వాతావరణ ఆధారిత భీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యువజన పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. వాతావరణ ఆధారిత భీమా క్రింద ప్రత్తి,అరటి, వేరుశనగ పంటలు, పీఎం ఎఫ్ బి ఐ క్రింద మొక్కజొన్న, మినుము, ఆముదం సజ్జలు, కందులు, ఉల్లి, వరి పంటలు నోటిఫై చేయబడిన వి అన్నారు. ఈ పంటలకు ఈనెల 30న, వరి పంటకు ఆగస్టు 15, రైతులు ప్రీమియం చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి, నరేంద్ర తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు మంజుల, రేవతి, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

## చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమస్యలు..

# కోళ్ల కృష్ణ యాదవ్ హామీలు ఏమయ్యాయి?

**విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, మంచినీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు.. అధికార పార్టీ మండల అధ్యక్షుడి స్పందన కోసం ఎదురుచూపులు**

కీసర 21 (పల్లె వెలుగు దినపత్రిక ) మేడ్చల్--







మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అంతరాయాలు, దెబ్బతిన్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు నిల్వ ఉండడం, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు వంటి సమస్యలు కాలనీ వాసులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గతంలో కాలనీ సమస్యలపై తాము అండగా ఉంటామని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పిన అధికార పార్టీ కీసర మండల అధ్యక్షుడు కోళ్ల కృష్ణ యాదవ్ ఇప్పుడు కనిపించడం లేదని పలువురు కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులపై ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలంలో డ్రైనేజీ సమస్య మరింత తీవ్రంగా మారుతుండగా, రాత్రివేళల్లో సరైన వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేక మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకత్వం స్పందించి చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కావాలని, అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

# వరి సాగులో మెలకువలు పాటించాలి

మహానంది, పల్లె వెలుగు వరి పంట సాగులో








రైతులు మెలకువలను పాటించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రవి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణ మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఆర్ ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్త రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. వరి పంట సాగులో విత్తనాల ఎంపిక కీలకమన్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు అన్నారు.ప్రస్తుత ఖరీఫ్ ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రైతులు పంటల సాగులో మెలకువలు పాటించాలన్నారు.రైతులు పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడరాదని తెలిపారు. డి ఆర్ సి వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించుకోవాలని, విచక్షణారహితంగా యూరియా ఎరువులు వాడరాదన్నారు. జీవన ఎరువులు, ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ వంటి జీవ శిలీంద్ర నాశిని లను విరివిగా వాడాలన్నారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి.. రైతులు తాము వేసిన పంటలకు సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలిసి వెంటనే పంట నమోదు చేయించుకోవాలన్నారు.వరి పంటకు ఎకరాకు రూ.800 , మొక్కజొన్నకు రూ.660, మినుము రూ.190, అరటి రూ. 2,750 ప్రీమియం చెల్లించి పంట బీమా చేసుకోవాలని తెలిపారు.వరి పంటకు ఆఖరి తేదీ ఆగస్టు 15 అని, మొక్కజొన్న , మినుము, అరటి పంటలకు జూలై 31వ తేదీ అన్నారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని పంట వేసిన ప్రతి రైతు పంట బీమా చేయించుకోవాలని అన్నారు. పంట బీమా కొరకు క్రాప్ సోన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు , పొలం పాస్బుక్ జిరాక్స్, బ్యాంక్ పాస్బుక్ జిరాక్స్ తో దగ్గర్లో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్ ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన అధికారి విశ్వద, పశు వైద్యులు డాక్టర్ శివానంద్, రైతులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు రహదారి నియమాలు తప్పనిసరి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి**

**మైనర్లు వాహనాలు నడిపితే రూ.25 వేల జరిమానా, జైలు శిక్ష: ట్రాఫిక్ సీఐ మన్సూర్ ఉద్దీన్**








పల్లె వెలుగు కర్నూలు బ్యూరో సమాజంలో ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (జడ్జి) బి. లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు నగర ట్రాఫిక్ సీఐ మన్సూర్ ఉద్దీన్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ 2వ బెటాలియన్ పరిధిలోని కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో రహదారి భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ప్రతి ఏటా ఎంతోమంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ విధిగా ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి ప్రాణ రక్షణ పొందవచ్చని చెప్పారు. వాహనదారులు ఓవర్ లోడ్‌తో నడపకూడదని హెచ్చరించారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు:

అనంతరం ట్రాఫిక్ సీఐ మన్సూర్ ఉద్దీన్ మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. మైనర్లు బైక్ లేదా కార్లు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు లేదా తల్లిదండ్రులకు రూ. 25,000 జరిమానాతో పాటు 3 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపితే రూ. 10,000 జరిమానా, గరిష్టంగా 6 నెలల జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిగ్నల్స్, జంక్షన్లు, జీబ్రా క్రాసింగ్ ప్రాధాన్యతను మోడల్ నమూనా ద్వారా విద్యార్థులకు అవగాహన పరిచారు.

విజేతలకు బహుమతుల ప్రధానం:

రహదారి భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కర్నూలు లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సహకారంతో జడ్జి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం రహదారి భద్రతపై రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, హరికృష్ణ మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెంచుగూడెంలను సందర్శించిన ప్రాజెక్ట్ అధికారి పి వి ఎస్ నాయుడు





బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 21 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారపురెడ్డి కుంట, నెమళ్ళ కుంట చెంచుగూడెంలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పీవీఎస్ నాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి నాయుడు గిరిజనులతో ముచ్చటించారు. చెంచు గూడెంలలో ప్రభుత్వపరంగా అమలవుతున్న వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గిరిజనులతో మాట్లాడారు. వి బి రాంజీ కార్యక్రమం కింద చేపడుతున్న కుంట పనులను ఆయన పరిశీలించారు. గిరిజనులందరూ రాంజీ పథకం ద్వారా చేపట్టే ఉపాధి పనులలో అందరూ పాల్గొని లబ్ధి పొందాలని పేర్కొన్నారు. ఉపాధి పనులకు సంబంధించి గిరిజనులకు వేతనాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయాలను గురించి గిరిజనులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ దత్తత తీసుకున్న నెమళ్ల కుంట గూడే న్ని కూడా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి నాయుడు సందర్శించారు. గూడెంలో నిర్వహిస్తున్న అగరుబత్తి శిక్షణ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అగర్బత్తి శిక్షణ విషయంలో గిరిజనులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. నెమలకుంట, నారపరెడ్డి కుంట ల లోని అంగన్వాడి కేంద్రాలను కూడా ఆయన తనిఖీ చేశారు. గిరిజన పిల్లలకు మధ్యాహ్న భోజనం పథకం సక్రమంగా అందుతుందా లేదా అన్న విషయాలను కూడా ఆయన పరిశీలించారు. వండిన వంటకాలను కూడా ఆయన స్వయంగా పరిశీలించారు. పాఠ్యపుస్తకాల పంపిణీ తో పాటు, బోధన విధానంపై ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గిరిజనులకు విద్యాబోధన విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నెమళ్ల కుంట లో నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన సిబ్బంది నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ప్రాజెక్ట్ అధికారి నాయుడు పరిశీలించారు. గిరిజన కుటుంబాలలోని ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సత్వరమే స్పందించి వారికి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ కేజీ నాయక్, ఇన్చార్జి ఎపిఓ రవీందర్ నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ శివలింగం తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

---

# సిద్ధమైన టిడ్కో గృహాల్లో చేరండి

**● లబ్ధిదారులకు కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి ● త్వరితగతిన అన్ని వసతులు కల్పిస్తాం ● కొత్తగా అందుబాటులోకి 554 గృహాలు**





పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిర్మించి సిద్ధం చేసిన టిడ్కో గృహాలను పొందిన లబ్ధిదారులు వెంటనే వాటిలో చేరి నివాసం ప్రారంభించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన జగన్నాథగట్టుపై ఉన్న టిడ్కో గృహాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు శాశ్వత గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం టిడ్కో గృహాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న గృహాలను ఖాళీగా ఉంచకుండా లబ్ధిదారులు వెంటనే స్వాధీనం చేసుకుని నివాసం ప్రారంభించాలని కోరారు. టిడ్కో గృహ సముదాయాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, పోలీస్ ఔట్‌పోస్ట్, బస్సు సౌకర్యం తదితర మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాల్లో సి-159, సి-160, సి-161, సి-163, సి-164, సి-165, సి-166, సి-171, సి-172, సి-173, సి-174, సి-175, సి-242, సి-245, సి-246, సి-247 బ్లాకుల్లో కొత్తగా మరో 554 గృహాలు లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చినట్లు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులు నగరపాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించి కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, టిడ్కో ఏఈ రక్షిత్, టిడ్కో స్పెషలిస్ట్ డాక్టర్ పెంచలయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# జల సంరక్షణకు పటిష్ఠ చర్యలు

**● నీరు కలుషితం కాకుండా.. వృథా నివారణపై ప్రత్యేక శ్రద్ధ ● ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి ● నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరాయంగా అందించడంతో పాటు నీటి వృథా, కలుషితాన్ని పూర్తిగా నివారించేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అశోక్‌నగర్, చదువుల రామయ్యనగర్, బుధవారపేట, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. అనంతరం జొహరాపురం డంప్‌యార్డులోని నిర్మాణ వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి, ప్లాంట్ స్థితి, పనితీరు విధానాన్ని పరిశీలించారు. విజయ థియేటర్ సమీపంలో నూతన సిసి డ్రైన్‌ను పరిశీలించారు. అలాగే మండిబజార్, జమ్మిచెట్టు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో తాగునీటి సరఫరా, పైపులైన్ల నిర్వహణ, లీకేజీల నివారణ, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. పైపులైన్లలో ఎక్కడైనా లీకేజీలు లేదా నీటి కలుషితానికి అవకాశం ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తాగునీరు వృథా కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో నీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. తాగునీటి సరఫరా విభాగ సిబ్బంది, అమినిటీస్ కార్యదర్శులు ప్రతిరోజూ నీటి నాణ్యతను పరీక్షిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తూ మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గిరిరాజ్, డీఈఈ పవన్ కుమార్, ఏఈలు జనార్ధన్, రాంమోహన్, శానిటరీ సూపర్వైజర్ రమేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు హుస్సేన్, జిలానీ బాషా, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే దేశ భవిష్యత్తు.. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: ఎస్సై దిలీప్ కుమార్

హోళగుంద పల్లె వెలుగు జులై :21 హోళగుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హోళగుంద పోలీస్ స్టేషన్ ఎస్సై దిలీప్ కుమార్ మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా మరియు సమాజంపై పడే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. అదేవిధంగా ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, పోలీసు శాఖ నుంచి వచ్చే కాల్స్, ప్రజాభిప్రాయ సేకరణలో నిజాయితీగా స్పందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ కీలక దశలో లేనిపోని ఆకర్షణలకు లోనై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# మనిషి బతుకు కుదేలు

పల్లె వెలుగు:ఉరుకుల పరుగుల హైటెక్ యుగంలో శాస్త్ర సాంకేతికత పరుగులు పెడుతున్నప్పటికీ నాలుగు గోడల నడుమ మనిషి బ్రతుకు కుదేలైంది. మనుషుల మధ్య మాటలు తగ్గిపోయాయి. ఈర్ష్య ద్వేషాలుచెలరేగుతున్నాయి. హత్యలు ఆత్మహత్యలు సమాజాన్ని శాసిస్తున్నాయి. ఫోన్లలోకంలోబంధాలన్నీమాయమవుతున్నాయి. ఒంటరితనంతో మనుసులు గాయపడుతున్నాయి. ఫేస్బుక్ లైకుల్లో నిజమైన సంతోషం దొరకదు నలుగురితో కలిస్తేనే మానసిక ప్రశాంతత లభిస్తుంది. కష్టసుఖాలు పంచుకునే వేదికలు మనకు కావాలి కలిసి నవ్వే



రోజులు మళ్లీ తిరిగి రావాలి. చదువుతోనే విద్యా విజ్ఞానంవికసించాలి. చదువుతోనే అజ్ఞాన చీకట్లను తరిమికొడదాం. విజ్ఞాన వెలుగులతో దేశ ప్రగతిని పెంచుదాం. పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి. భావి భారత పౌరులుగాఎదగడం బాలల హక్కు కావాలి. విద్యాహక్కులతో ఉచిత విద్య అందించాలి. బాలకార్మిక రహిత సమాజాన్ని నిర్మించాలి. ప్రతి బిడ్డను బడిబాట పట్టిద్దాం. ప్రతి బిడ్డను సంస్కారవంతమైన పౌరులను తీర్చిదిద్దుదాం. పచ్చని ప్రకృతి మనకు ప్రాణాధారం పర్యావరణాన్ని కాపాడడం మన కర్తవ్యం కావాలి. మొక్కలు నాటుదాం ప్రతి ఇంట కాలుష్య మహమ్మారిని అరికడుదాం. హింస లేని నవ సమాజాన్ని నిర్మిద్దాం. కల్మషాలు వీడి అందరూ ఒకటిగా కలుద్దాం కలహాలు లేని మంచి సమాజాన్ని నిర్మిద్దాం. ఎవరు ఎక్కువ ఎవరు తక్కువ కాదు ఐక్యతను మించిన బలం ఇంకొకటి లేదు. కలిసికట్టుగా సాగితే విజయం మన సొంతమవుతుంది. ద్వేషాన్ని గెలిచిన చోటే మానవత్వం వికసిస్తుంది. అక్షరాల వెలుగుతో అజ్ఞానాన్ని జయించాం. పచ్చని ప్రకృతితో కాలుష్యాన్ని ఓడిద్ధం. ఒంటరితనాన్ని వీడి సమాజంతో కలిసి నడుద్దాం. కన్నకలలను నవ సమాజ నిర్మాణంతో నిజం చేసి చూపిద్దాం. నలుగురితో కలిసి నడిచేఅడుగే నవసమాజానికి పునాది ఆకలయిక సాధించే విజయమే రేపటి ప్రగతికి నాంది కావాలికలిసి నడుద్దాం. ప్రగతిని పురోగతిని సాధిద్దాం. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ఉద్యమిద్దాం. నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఫోరంమాజీ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి కరీంనగర్.

# నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు త్వరగా ఇవ్వాలి సిపిఐ.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలోని స్థానిక సాయిబాబా నగర్ లో ఉన్న స్వామి రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశానంతరం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో న్యాయశాఖ మంత్రి ఎన్ ఎం డి ఫారుక్ ని కలిసి మీరు అధికారంలోకి వచ్చినప్పటి నుండి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో అన్ని వార్డులలో తిరిగి ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి దాదాపు నాలుగు వేల ఇంటి దరఖాస్తు అర్జీలను వ్యక్తిగతంగా సచివాలయాల దగ్గర ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ఇప్పించడం జరిగింది. తమరు దయవుంచి పేద ప్రజలకు న్యాయం చేయాలని అడగగా వెంటనే ఎమ్మార్వో కి ఫోన్ చేసి నంద్యాల పట్టణంలో ల్యాండ్ ఎక్కడ ఉందో వెరిఫై చేయండి మేము ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పి మీరు వెంటనే ఎమ్మార్వో దగ్గరికి వెళ్ళండి ఎమ్మార్వో ని కలవండి ల్యాండ్ గురించి మాట్లాడండి అని చెప్పారు . మేము మరల ఎమ్మార్వో దగ్గరికి పోవడం జరిగింది . ఎమ్మార్వో మూడు నాలుగు చోట్ల ల్యాండ్ చూడడం జరిగిందని ఎక్కడ అణువుగా ఉంటుందో అక్కడ త్వరగా చూస్తామని హామీ ఇవ్వడం జరిగిందిఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు లక్ష్మీదేవి, భూమని శ్రీనివాసులు, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు, ఏ ధనుంజయ్, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ తోపాటు సిపిఐ పట్టణ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 54 ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని మంత్రికి వినతి పత్రం సర్కిల్ ఇన్స్పెక్టర్.



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. జీవో నెంబర్ 54 ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం ఇచ్చిన ఉమ్మడి కర్నూలు జిల్లా సర్కిల్ ఇన్స్పెక్టర్లు. మే నెల 14వ తారీఖున జీవో నెంబర్ 54 ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం డి.ఎస్.పి స్థాయి పదోన్నతులు రాష్ట్రస్థాయి పరిధిలో సీఐపదోన్నతులు జోనల్ పరిధిలో ఉండే విధంగా పేర్కొంటూ జీవో విడుదల చేసింది.. గతంలో పోలీసు పదోన్నతులు మరియుబదిలీలు జోన్లవారీగా నాలుగు విభాగాలుగా చేపట్టేవారు.. తాజాగా 15 జులై 2026 జీవో నెంబర్ 103ను ప్రభుత్వం విడుదల చేసింది.. జీవో నెంబర్ 103 ప్రకారం ఉమ్మడి రాయలసీమ జిల్లాలు మరియు ప్రకాశం నెల్లూరు జిల్లాల్లో పనిచేసే సీఐలకు, ఎస్ఐలకు తీవ్రమైన అన్యాయం జరిగే అవకాశం ఉంది.. 103 జీవో ప్రకారం నాలుగు జోన్లను రద్దుచేసి రాష్ట్రస్థాయి లో మల్టీ లెవెల్ జోన్ వన్ మల్టీ లెవెల్ జోన్ రెండు గావిభజించారు.. దీనివలన ఉమ్మడి రాయలసీమ జిల్లాలైన కడప కర్నూలు అనంతపురం, చిత్తూరు అలాగే ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో పనిచేసే ఎస్సైలు సిఐల కు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని జీవో నెంబర్ 103 ని రద్దుచేసి పాత విధానమే ఉండాలని కోరుతూ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు పోలీసు అధికారులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.. ఉదాహరణకు ఒకే తారీఖున ఎస్సైలుగా ఒకరు మల్టీ లెవెల్ జోన్ వన్ మరొకరు మల్టీ లెవెల్ జోన్ టు లో పదవి బాధ్యతలు చేపడితే మల్టీ లెవెల్ జోన్ వన్ లో ఉన్న ఎస్ఐకి త్వరగా పదోన్నతి రావడం మల్టీ లెవెల్ జోన్2 లో ఉన్న ఎస్ఐకి పదోన్నతులు రాకపోవడం జరుగుతుంది.. అక్కడ ఉన్న ఎస్ఐ సీఐ గా, డీఎస్పీగా పదోన్నతి పొందితేమల్టీ లెవెల్ జోన్ 2 లో ఉన్న ఎస్ఐ సీఐ దగ్గర ఆగిపోయే అవకాశం ఉంది.. కనుక జీవో నెంబర్ 103ని రద్దుచేసి పాత జీవోలో ప్రకారమే తమకు న్యాయం చేయాలని మంత్రి దృష్టికి సిఐలు తీసుకురావడం జరిగింది... న్యాయమైన వారి కోరికలు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి మానవతా దృక్పథంతో ఆలోచన చేసి న్యాయం చేయాలని కోరారు.

## ఐదు నెలలుగా జీతాలు లేవు.. ఎంపీఈఓల ఆవేదన

### - ఏడిఏ, ఏవో లకు ఎంపీఈఓల వినతిపత్రం

హోళగుంద పల్లె వెలుగు జులై :21 ఆలూరు డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న మల్టీ పర్పస్





ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (ఎంపీఈఓలు) తమ సమస్యల పరిష్కారం కోసం సహాయ వ్యవసాయ సంచాలకుడు చంగల్ రాయుడుకు, హోళగుంద మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోక దళ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, ప్రతి ఏడాది మార్చి నెలలో రావాల్సిన సర్వీస్ రెన్యూవల్ జీవో గత ఐదు నుంచి ఆరు సంవత్సరాలుగా తీవ్ర ఆలస్యంగా వస్తోందని తెలిపారు. ఈ ఏడాది కూడా ఇప్పటివరకు రెన్యూవల్ జీవో విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, మార్చి నెల నుంచి నిధుల కొరత, సాంకేతిక కారణాలతో ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబ పోషణ భారంగా మారిందని, ప్రభుత్వం తమ సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఎంపీఈఓలు తమ ప్రధాన డిమాండ్లుగా: నాన్-శాంక్షన్ పోస్టులను శాంక్షన్ పోస్టులుగా మార్చాలి. శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం కింద నెలకు రూ.35,000 వేతనం అమలు చేయాలి. హెల్త్ కార్డులు, ఎక్స్‌గ్రేషియా లేదా గ్రాట్యుటీ సదుపాయం కల్పించాలి. మహిళా ఉద్యోగినులకు చైల్డ్ కేర్ లీవ్స్ మంజూరు చేయాలి. నిధుల కొరత సాకులు చెప్పకుండా పాత సీఎఫ్ఎంఎస్ విధానంలో ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. వినతిపత్రాన్ని పరిశీలించిన సహాయ వ్యవసాయ సంచాలకుడు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీఈఓలు విశాల్ లక్ష్మి,రంగన్న, రవి శేఖర్, మహమ్మద్ యూసుఫ్,ఉత్తర్, మనోహర్, నాజర్ తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు ఘనంగా వీడ్కోలు

ఎమ్మిగనూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వై.వెంకటేశ్వర్ రెడ్డి బదిలీ కావడంతో బ్యాంకు సిబ్బంది,ఖాతాదారులు,రైతులు,



ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నూతన బ్రాంచ్ మేనేజర్ ధర్మారావు మాట్లాడుతూ బదిలీ అయిన మేనేజర్ తన పదవీకాలంలో ఖాతాదారులకు సత్వర సేవలు అందించి,రైతులు,స్వయం సహాయక సంఘాలు,చిన్న వ్యాపారులకు రుణాల మంజూరులో విశేష కృషి చేశారని కొనియాడారు. అనంతరం బదిలీ అయిన మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ నా సొంత ఊరు మార్కాపురం జిల్లా,నేను కడప బ్రాంచ్ నుండి ఎమ్మిగనూరు బ్రాంచ్ కి రావడం జరిగిందని,నేను ఇక్కడికి రావడం మొదటిసారి ఇక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయో అనుకున్నాను,కానీ అంతా ఇక్కడ బాగుందని,ఈ బ్రాంచ్ లో రెండు సంవత్సరాలు పనిచేశానని,తనకు సహకరించిన సిబ్బంది,రైతులు, ఖాతాదారులు,ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ పనిచేసినా ఇదే విధంగా ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తానని చెప్పారు. నాకు ప్రమోషన్ గుంటూరు హెడ్ ఆఫీస్ కు రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం ముగింపులో మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి కి శాలువా,పూలమాలతో సత్కరించి,జ్ఞాపికను అందజేసి నూతన విధుల్లో విజయవంతం కావాలని బ్యాంకు సిబ్బంది ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివ సర్కిల్ మేనేజర్ శ్రీనివాసులు, బ్యాంక్ సిబ్బంది ఫీల్డ్ ఆఫీసర్ బాబు,వినయ్, అరున్ , సుబ్బయ్యమ్మ , అనూష, అయేషా బి బి , మినీ బ్యాంక్ బీసీలు ఉరుకుంద, వీరేష్ , వివో ఏ ప్రసాదు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## కాశి నాయన నామస్మరణ ఆరాధన మహోత్సవాలు...



చాగలమర్రి పల్లె వెలుగు జూలై 21 ఈనెల 22 తేదీ బుధవారం నుంచి 29 వరకు జ్యోతి మండలం తో పాటు చాగలమర్రి మండల పరిధిలోని భైరవ గుండాల ఆలయాలలో కాశి నాయన నామస్మరణ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలియజేశారు. రోజువారి పూజ కార్యక్రమాలలో భాగంగా ఏక నామం, ఓం కాశి నాయన, శ్రీ కాశి నాయన, జయ జయ కాశి నాయన పూర్ణహుతి తదితర కార్యక్రమాలు వారం రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 24 గంటలు భక్తులు నామస్మరణ చేస్తారన్నారు. పలు జిల్లాల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. భజన బృందాలతో కాశినాయన నామం పలికి ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. ప్రతిరోజు రాత్రి 8 గంటల నుంచి భజన బృందాలతో కాశి నాయన ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 28న గొప్ప మంగళ వాయిద్యాలతో వాత్సాయన ఉత్సవం జరుగుతుందని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. చివరి రోజున 29వ తేదీ పూర్ణహుతి అనంతరం హాజరైన భక్తులకు భజన బృందాలకు సన్మాన కార్యక్రమాలు తీర్థప్రసాదాలు ప్రసాదిస్తారని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఆదర్శ పాఠశాలలో శక్తి యాప్ పై అవగాహన

బండి ఆత్మకూరు పల్లెవెలుగు జూలై 21 : నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్



వెంకటేశ్వర్లు, ప్రసాదు,మహిళా కానిస్టేబుల్ లక్ష్మీదేవి బండి ఆత్మకూరు లోని ఆదర్శ పాఠశాలలో శక్తి యాప్ పై విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల ఎస్పీ, ఆదేశాల మేరకు ఏ ఎస్ పి సుస్మిత రామనాథన్ ఉత్తర్వుల మేరకు యాప్ పై ప్రిన్సిపల్ రఫీ ఆధ్వర్యంలో శక్తి యాప్ గురించి సదస్సును నిర్వహించారు. శక్తి ఆప్ నంబర్ 7993485111 ను తెలిపి ఎక్కడైనను సైబర్ నేరములు జరిగినచో, ఫేక్ యాప్స్ వచ్చిన ఫేక్ మెసేజెస్ వచ్చినా వాటిని ఓపెన్ చేయరాదని వాటి వలన కలిగే ఆర్థిక నష్టాల గురించి వివరించారు. అట్లు జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, చిన్నపిల్లల పై



అత్యాచారాలు జరిగిన,బాల్య వివాహంలు జరిగిన టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. అమ్మాయిలు మహిళలు ఆపద సమయంలో శక్తి యాప్ నంబర్ కు వీడియో కాల్ గాని నార్మల్ కాల్ గాని చేస్తే వెంటనే పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అమ్మాయిల పట్ల ఎవరైనా చెడుగా ప్రవర్తించినచో నేరుగా స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని,లేదా 112,100 కు ఫోన్ చేసి చెప్పినచో పోలీసులు తక్షణమే స్పందిస్తారని శక్తి టీం బృందం వివరించింది. అమ్మాయిలు ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రుల మొబైల్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోనవలెనని శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానాన్ని గురించి వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి బాల్యవివాహాల గురించి బాల్య వివాహములు చేయుట వలన కలిగే అనర్థాల గురించి విమెన్ వెల్ఫేర్ నంబర్ 181 గురించి వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోను కాకూడదని గంజాయి గుట్కా మందు సిగరెట్స్ మొదలగు వాటికి అలవాటు పడకూడదని దాని వలన కలిగే అనర్థాలను వివరించి ప్రతి అమ్మాయి మహిళల మొబైల్ నందు శక్తి యాప్ ఉండాలని, శక్తి యాప్ ఒక రక్షణ కవచంగా ఉంటుందని తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులు

# ఆపాలని డిమాండ్ చేస్తూ..నిరసన వ్యక్తం చేసిన వైసీపీ నేతలు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కూటమి






ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ వైసీపీ మహిళా నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళపై రోజురోజుకూ పెరుగుతున్న ఆకృత్యాలకు అడ్డుకట్ట వేసేదెవరు..? చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమా..?"అవును... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటిన నాటి నుంచి మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, దారుణ హత్యలు పరాకాష్టకు చేరాయని... పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికీ భద్రత లేకుండా పోయిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు!ఇది నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సెంటర్! ఇక్కడ ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా వినతి పత్రం అందజేశారు . అధికారంలో ఉన్న పాలకులు కళ్లు తెరవాలంటూ వైఎస్సార్సీపీ నేతలు గళమెత్తారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్టేట్ మహిళ విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, అసెంబ్లీ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా జోనల్ మహిళ ఇన్చార్జి గాజుల శ్వేతా రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మతో పాటు భారీగా తరలివచ్చిన మహిళా నేతలు నేడు పెద్ద ఎత్తున నిరసన గళం విప్పారు.

ఎమ్మెల్సీ ఇషాక్ బాషా , మహిళా నేతలు మాట్లాడుతూ... "ఇటీవల గుంటూరులో ఏం జరిగింది..? బద్వేలులో ఏం జరిగింది..? కన్నతల్లి లాంటి ఆడపడుచులను దిగంబరంగా చేసి రోడ్డుపై అవమానించిన ఘటనలు చూస్తుంటే... ఇది నాగరిక సమాజమేనా అని గుండె తరుక్కుపోతుందని, సభ్యసమాజం తలదించుకునేలా దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ హృదయ విదారక సంఘటనలు మన రాష్ట్ర ప్రతిష్టకే మాయని మచ్చగా మారాయని తీవ్రంగా విమర్శించారు. "అత్యంత దారుణమైన విషయమేమిటంటే... ఈ అఘాయిత్యాలకు ఒడిగడుతున్న నిందితుల వెనుక అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వస్తుంటే ఈ రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఎక్కడుంది..? రాజకీయ ఒత్తిళ్లతో కేసులు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారు. విచారణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికార బలంతో నేరస్థులను కాపాడుతుంటే బాధితులకు న్యాయం ఎలా జరుగుతుంది..?" "చట్టం ముందు అందరూ సమానమే అనే నమ్మకాన్ని ప్రజల్లో నిలబెట్టాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది! రాజకీయం వేరు... ఇంట్లో ఉండే ఆడపిల్లల భద్రత వేరు! పక్షపాతం లేకుండా, అధికార బలపరీక్షలు పక్కనబెట్టి నేరస్థులను కఠినంగా శిక్షించకపోతే... కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని వైకాపా నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందో... లేక ఈ అఘాయిత్యాలను నిర్లక్ష్యం చేస్తూ పోతుందో చూడాలి!" ఈ కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ అధ్యక్షురాలు హుస్సేనమ్మ, రాష్ట్ర మాజీ దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మాజీ వైస్ ఎంపీపీ పార్వతమ్మ, బనగానపల్లె అసెంబ్లీ అధ్యక్షురాలు షాజహాన్, మాజీ కౌన్సిలర్స్ కన్నమ్మ, సావిత్రమ్మ, నంద్యాల ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, వైసిపి నాయకుడు సాయిరాం రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు టివి రమణ, స్టేట్ సెక్రటరీ మధుబాబు, స్టేట్ మైనార్టీ సెల్ సెక్రెటరీ ఇక్బాల్, స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ నాగేంద్ర, స్టేట్ జనరల్ సెక్రెటరీ యూనిస్ బాష, నంద్యాల జిల్లా వైసీపీ సెక్రటరీ దేవనగర్ బాషా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు సుమంత్ రెడ్డి, వైసీపీ జిల్లా యూత్ వింగ్ సెక్రటరీ గగ్గుటూరు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మేసా చంద్రశేఖర్, మరియు మహిళలు జిల్లా వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# దస్తావేజు లేఖరుల జీవనోపాధిని

# దెబ్బతీసే జీవో నెం.369ను రద్దు చేయాలి,

### స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పీపీపీ విధానాన్ని విరమించుకోవాలి,,





ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 21 దస్తావేజు లేఖరుల జీవనోపాధిని దూరం చేసే రాష్ట్ర ప్రభుత్వ జీవో నెం.396ను తక్షణమే రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం వేలాది మంది దస్తావేజు లేఖరుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న, సిపిఐ సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు చేపట్టిన రెండవ రోజు పెన్‌డౌన్ నిరసనకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు సులభంగా, పారదర్శకంగా సేవలు అందించాల్సిన ప్రభుత్వ శాఖలను క్రమంగా ప్రైవేటీకరణ వైపు నడిపించడం సరైన విధానం కాదని వారు పేర్కొంది.

దశాబ్దాలుగా ఈ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న దస్తావేజు లేఖరుల కుటుంబాల జీవనోపాధిని ప్రమాదంలోకి నెట్టే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

దస్తావేజు లేఖరులతో పాటు సహాయకులు,డిటిపి ఆపరేటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టాంపు వెల్డర్లు, టీ కొట్టు వీరి కుటుంబాలు మొత్తం రోడ్నపడే పరిస్థితి కూటమి ప్రభుత్వం తీసుకురావడం చాలా దుర్మార్గమని వారు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో నెం.369ను రద్దు చేసి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పీపీపీ విధానాన్ని పూర్తిగా విరమించుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. దస్తావేజు లేఖరుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. ప్రజల ప్రయోజనాలను, ఉద్యోగుల జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరింది.

ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వీరేష్,మల్లికార్జున, గౌడ్ నరసింహులు,నాగరాజు, శాంతప్ప తదితరులు పాల్గొన్నారు

# పరిశ్రమలకు గడువులోనే అన్ని అనుమతులు మంజూరు చేయాలి.

● పారిశ్రామిక పెట్టుబడులకు వేగవంతమైన అనుమతులే లక్ష్యం. ● పెండింగ్ పారిశ్రామిక సమస్యల పరిష్కారానికి శాఖల సమన్వయం అవసరం. ● పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.




**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**
జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన అన్ని అనుమతులను నిర్ణీత సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ (ఎస్ ఎల్ ఏ) కాలపరిమితిలోనే మంజూరు చేస్తూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు, భూ సమస్యలు, మైనింగ్ లీజులు, పర్యావరణ అనుమతులు, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు, వెబ్‌ల్యాండ్ నవీకరణలు, పర్యాటకాభివృద్ధి, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెయిన్ సిమెంట్స్, రామ్‌కో, జేఎస్‌డబ్ల్యూ, జయజ్యోతి, అల్ట్రాటెక్ సంస్థలకు సంబంధించిన మైనింగ్, భూసేకరణ, భూ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, గ్రౌండ్‌వాటర్ ఎన్‌ఓసీ, రైల్వే సైడింగ్, అవుకు రిజర్వాయర్ నుంచి నీటి వినియోగానికి సంబంధించిన పెండింగ్ అంశాలను సమీక్షించి, వాటి పరిష్కారానికి రెవెన్యూ, గనులు, భూగర్భ జలాలు తదితర శాఖలు సమన్వయంతో సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశ్రమలకు సంబంధించిన క్లియరెన్సులు, ఎన్‌ఓసీల కోసం దరఖాస్తు చేసుకునే పారిశ్రామికవేత్తలకు ప్రారంభ దశలోనే సరైన మార్గదర్శకాలు అందించి, సాంకేతిక లోపాల కారణంగా దరఖాస్తులు తిరస్కరణకు గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

రెయిన్ సిమెంట్స్, రామ్‌కో, జేఎస్‌డబ్ల్యూ, జయజ్యోతి సంస్థలకు సంబంధించిన మైనింగ్ లీజు ప్రాంతాల్లో ఉన్న డి-పట్టా, భూ వివాదాలను రెవెన్యూ, గనుల శాఖ అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గత రెండేళ్లుగా అసైన్మెంట్ కమిటీ సమావేశాలు జరగలేదని, కొత్తగా డి-పట్టాలు కేటాయించే పరిస్థితి లేదని తెలిపారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల నవీకరణకు రెండు వారాల గడువు నిర్ణయిస్తూ, జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ఎంట్రీలను సరిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రైవేట్ భూసేకరణ, మ్యుటేషన్ పెండింగ్ కేసులు, అవార్డు ప్రతిపాదనలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల వినియోగానికి సంబంధించి ఎన్‌ఓసీ మంజూరులో నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాల శాఖ నిర్దేశించిన ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నివేదిక సమర్పించిన వెంటనే నిబంధనల మేరకు ఎన్‌ఓసీ ప్రక్రియను వేగవంతం చేస్తామని కలెక్టర్ రెయిన్ సిమెంట్ ప్రతినిధులకు తెలిపారు.

ఎంఎస్‌ఎంఈల కోసం ప్లాట్ల కేటాయింపుకు సిద్ధంగా ఉన్న పారిశ్రామిక పార్కుల వివరాలతో సమగ్ర నివేదిక రూపొందించి, స్థానిక పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి అవకాశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. శ్రీశైలం, సున్నిపెంట, పాణ్యం ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. సున్నిపెంటలో నాణ్యమైన హెల్త్ రిసార్టులు, హోటళ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని, పాణ్యం వద్ద వే-సైడ్ ఎమినిటీస్ అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పచ్చర్ల జంగిల్ క్యాంప్, శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో టూరిజం షాపులు, కేఫ్‌లు, సావనీర్ కేంద్రాలు ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని టూరిజం అధికారులకు సూచించారు.



*పునరుత్పాదక ఇంధన రంగంలో జెన్కో, సెయిల్, సెకి, గ్రీన్ రెన్యూవబుల్ ఎనర్జీ, హీరో గ్రూప్, ఇండోసోల్ తదితర సంస్థల ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పంప్డ్ స్టోరేజ్, సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న లీజు ఒప్పందాలు, భూ సెటిల్మెంట్, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రక్రియలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.*

సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి మొత్తం 11 దరఖాస్తులు అందగా, వాటిలో 7 దరఖాస్తులకు ఇప్పటికే సంబంధిత శాఖల ద్వారా అనుమతులు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన నాలుగు దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ సబ్సిడీ, పన్ను రాయితీలు తదితర పథకాల కింద జిల్లాలోని ఉత్పాదక, సేవారంగాలకు చెందిన ఎనిమిది యూనిట్లకు రూ. 72.28 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను మంజూరు చేయడానికి కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, రెయిన్ సిమెంట్స్, రామ్‌కో, జేఎస్‌డబ్ల్యూ, జయజ్యోతి, అల్ట్రాటెక్ సంస్థల ప్రతినిధులు, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం, లీడ్ జిల్లా మేనేజర్ (ఎల్‌డీఎం) అయ్యప్పరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మన భూమా మన భీమా కార్యక్రమం

**రామలక్ష్మి కొట్టాల డ్రైనేజి సమస్య 25 లక్షలు తో నాలుగు నెలల్లో పూర్తి**
**ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**









ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 21, పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల కాలనీలోని డ్రైనేజి సమస్యను 25 లక్షలతో నాలుగు నెలల లోపు పూర్తిచేస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ హామీ ఇచ్చారు. మంగళవారం రామలక్ష్మి కొట్టాల కాలనిలో మన భూమా మన దిమా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లుతూ ఎన్నికల ముందు ఈ ప్రాంతా వాసులకు నేను హామీ ఇవ్వడం జరిగిందని, యిచ్చిన మాట ప్రకారం డ్రైన్ సమస్య క్లియర్ చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వంలో వైసిపి నాయకులు కాలువలను కేవలం వాళ్ల జోబులు నింపుకోవడం కోసమే వేశారని అన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలకె మున్సిపల్ మినిస్టర్ నారాయణతో మాట్లాడి 2కోట్లు అదనంగా సాంక్షన్ చేయించుకొని 4 కోట్ల రూపాయలతో డ్రైనేజీలు కాలువలు అభివృద్ధి చేయడం జరిగిందని, ఇంకా రాబోయే రోజుల్లో మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చేస్తామని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష, పట్టణ ఎస్సై రామకృష్ణారెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి టిడిపి నాయకులు నాగాంజనేయులు టిడిపి కార్యకర్తలు భూమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యపై తక్షణ స్పందన... ఈబీజీ గోవింద్ గౌడ్

**సోషల్ మీడియాలో సమాచారం... గంటల్లోనే నెరణికి గ్రామానికి తాగునీటి ట్యాంకర్లు**
**నెరణికి దాహానికి తక్షణ పరిష్కారం...ప్రజల కష్టమే బాధ్యత...**





హోళగుంద పల్లె వెలుగు జులై :21 సామాజిక మాధ్యమాల్లో వచ్చిన తాగునీటి సమస్య సమాచారంపై ఆలస్యం చేయకుండా స్పందించిన ఆలూరు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్ నెరణికి గ్రామానికి వెంటనే రెండు తాగునీటి ట్యాంకర్లను పంపించి గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా ఏర్పాటు చేశారు. హొళగుంద మండలంలోని నెరణికి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వాట్సాప్ ద్వారా సమాచారం అందిన వెంటనే, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడకుండా అత్యవసర చర్యలు చేపట్టారు. ఈ సేవా కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ యువనాయకులు ఈబీజీ రాజేంద్ర గౌడ్ కూడా పాల్గొని గ్రామ ప్రజలకు అండగా నిలిచారు.

ఈ సందర్భంగా ఈబీజీ గోవింద్ గౌడ్ మాట్లాడుతూ, నెరణికి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఆలూరు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి దృష్టికి వెంటనే తీసుకెళ్లినట్లు తెలిపారు. గ్రామానికి శాశ్వత తాగునీటి పరిష్కారం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

గ్రామ ప్రజలు మాట్లాడుతూ, “ఒక్క వాట్సాప్ సమాచారం అందగానే స్పందించి తాగునీటి ట్యాంకర్లను పంపించిన ఈబీజీ గోవింద్ గౌడ్ గారికి, ఈబీజీ రాజేంద్ర గౌడ్ గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రజల సమస్యలపై ఇలాగే వెంటనే స్పందిస్తూ సేవలు కొనసాగించాలని కోరుకుంటున్నాం” అని ఆనందం వ్యక్తం చేశారు.

సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారానికి వెంటనే స్పందించి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపట్టిన ఈబీజీ గోవింద్ గౌడ్ సేవాభావాన్ని స్థానికులు అభినందించారు.

# పొదుపు సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషిచేసి అభివృద్ధి బాటలో నడిపించాలి..

**జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీధర్ రెడ్డి..**



గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలం మహిళా సమైక్య నందు మంగళవారం నాడు పొదుపు సంఘాల బలపేతానికి పలు అంశాల గురించి సమావేశం ఏర్పాటు చేయగా ఈ సమావేశానికి నంద్యాల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి డిపిఎం సుభద్రమ్మ బ్యాంకు లింకేజీ ఏపిఎం ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సమావేశంలో మండల మహిళా సమైక్య నందు పనిచేస్తున్న సిబ్బంది అన్ని గ్రామాల వివోఏలు హాజరుకాగా పలు అంశాల గురించి ప్రతి ఒక్క గ్రామ సంఘం గురించి విధివిధానాలను సంఘాలు ఏ విధంగా నడుస్తున్నాయి వాటి ప్రణాళికల గురించి తెలుసుకున్నారు. సంఘాలను మరింత బలపడే విధంగా ప్రభుత్వ పథకాలను పొదుపు సంఘాలకు చేరే విధంగా ప్రతి ఒక్క వివోఏ సంబంధిత సీసీ కృషి చేయాలని పలు సూచనలు తెలియజేశారు. మీకు కేటాయించిన పనులను గురించి ఎందుకు ఆలస్యమైతుంది తర్వాత జరిగే సమావేశలకు ప్రతి ఒక్కరు ఇంప్రూవ్మెంట్ చేయాలని వారికి పలు సూచనలు ఇచ్చారు. మహిళా సంఘాలకు ప్రతినెల ముగ్గురు చొప్పున జీవనోపాదులు కల్పించి మహిళా సంఘాలను బలోపేతం చేయాలి. గ్రామ సంఘానికి సంబంధించిన పొదుపు సంఘాలను ప్రతినెల మొబైల్ బుక్ కీపింగ్ 15 తేదీ లోపల పూర్తిచేసి గడివేముల మండలాన్ని ప్రథమ స్థానంలో వచ్చే విధంగా చూడాలని పలు హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సంఖ్య అధ్యక్షురాలు ఎల్లమ్మ, ఏపిఎం ,జ్యోతి, సుబ్బయ్య, సిసిలు, ఎన్ ,చెన్నయ్య, మహబూబి, చెన్నయ్య, గ్రామ సంఘాల విఓఏలు పాల్గొన్నారు.

# హీరోను కలిసిన అభిమానులు

కడప జిల్లా:పల్లె వెలుగు జూలై 21:- కడప జిల్లాలోని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నూతనంగా నటిస్తున్న సినిమా షూటింగ్ లో పాల్గొన్నారు. షూటింగ్ కి వచ్చిన హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నంద్యాల ప్రెసిడెంట్ ఎస్ఎం భాష, హబి భాష, హాజీ సలాం, జుబేర్, శివ అభిమానుల్ని తీసుకెళ్లి కల్పించారు. అభిమానులతో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడి ఫోటోలు దిగారు. ఈ అవకాశాన్ని కల్పించిన హీరో అసిస్టెంట్ శంకరన్నకు నంద్యాల అభిమానులు కృతజ్ఞతలు తెలియజేశారు.





Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com